



# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## నాణ్యమైన మందులను విక్రయించాలి



**గూడూరు, జూన్ 19, ప్రభాతవార్త** గూడూరు రెండో పట్టణం పరిధిలోని జనతా బజార్, శ్రీ సాయి బాలాజీ రైతు డిపో, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, గోడౌన్‌లను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మందులు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, నాణ్యమైన మందులను రైతులకు విక్రయించాలన్నారు. గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామంలోని సచివాలయం ను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని రీ సర్వే పై గ్రామ సర్వేయర్‌లకు పలు సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి.ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి స్మరణ్ దేవస్థానం 7 వ వార్షికోత్సవం





**సంగం జూన్ 19 ప్రభాతవార్త** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలో ఈనెల 20 వతేది శ్రీసాయి స్మరణ్ దేవస్థానం 7 వ వార్షికోత్సవం వేడుకగా జరగనున్నట్లు నిర్వాహకులు ఆనం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, విష్ణుపూజ, హోమం, అభిషేకం తోప్రారంభం అవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయింత్రం 4 గంటలకు గ్రామోత్సవం వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయిబాబా భక్తులు,ప్రజలు పెద్దఎత్తున పాల్గోనాలని ఆయన పిలుపునిచ్చారు.

## రెండేళ్ళ ఎన్‌డిఏ కూటమి పాలనలో ఆత్మకూరుకు అగ్రస్థానం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**ఆత్మకూరు, జూన్ 19, ప్రభాతవార్త :** రెండేళ్ళ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ పాలనలో ఆత్మకూరును అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపామని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ ప్రజల ఆనందోత్సాహాల మధ్య రాష్ట్రంలో ఎన్‌డిఎక ఊటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా "నమ్మకం! అభివృద్ధి!! సంక్షేమం" విజయోత్సవ సంబరాలను మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాల ను మంత్రి ప్రజలకు వివరించారు.

**మంత్రి ఆనం మాట్లాడుతూ** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళ లో ఆత్మకూరు నియోజకవర్గానికి సంక్షేమ కార్యక్రమాలకు 3,467.17కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు 3,084.53కోట్లు వెచ్చించామని, మొత్తం 6,545.70కోట్లతో రికార్డు స్థాయిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ , పించన్లు , ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 , తల్లికి వందనం వంటి పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరిందన్నారు.

❖ దేవాదాయ శాఖమంత్రిగా పనిచేయడం తనకు మహాభాగ్యంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి దేవాదాయ శాఖకు సంబంధించి నిర్దేశించిన 11ప్రధాన వాగ్ధానాల్లో ఇప్పటికే 10 వాగ్ధానాలను అమలు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో 800లకు పైగా పురాతన ఆలయాల పునర్నిర్మాణం చేపడుతూ భగవత్ సంకల్పంతో ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను పూర్తిచేసి మర్రిపాడు వరకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సోమశిల రిజర్వాయర్, సంగం బ్యారేజ్, ఎస్ఆర్ హైలెవల్ కెనాల్, కావలి కాలువ, కనిగిరి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల పనులు వేగంగా కొనసాగుతున్నా యన్నారు.

❖ ఆత్మకూరు మెట్టప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. మర్రిపాడులో 300ఎకరాల విస్తీర్ణంలో 500కోట్ల పెట్టుబడితో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని దీంతో స్థానిక యువతకు పెదనద ఎత్తున ఉపాది అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంఎస్ఎంఇ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ఆటోనగర్, నగరవనం, క్రీడాప్రాంగణం వంటి ప్రాజెక్టులను మంజూరు చేశామని, మున్సిపాల్టీ పరిధిలో 75కోట్లతో మౌళిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నరగామీణాభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమాల కింద భారీ నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు. గత రెండేళ్ళలో ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందడుకు తీసుకెళుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రాబోయే మూడేళ్ళలో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంచేశారు. తొలుత ఆర్‌డిఒ పావని, డిఎల్‌డిఒ రమణయ్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు జరిగిన మంచిని వివరించారు. అనంతరం 28 మంది లబ్ధిదారులకు సుమారు 30లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులనఉ మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిడతా పోలూరులోని పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తాం

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హామీ





**ముత్తుకూరు, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో వున్న పిడతా పోలూరులో గత 70 సంవత్సరాల నుంచి పంటలు సాగు చేసుకుంటున్న పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హామీ ఇచ్చారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలో వినూత్నంగా ప్రారంభించిన పల్లె వీక్షణం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ముత్తుకూరు మండలం పిడతా పోలూరు గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం ద్వారా సహజ ఎరువులను తయారు చేస్తున్న కళ్యాణికి ప్రభుత్వం తరఫునుంచి ఆర్థిక సహాయం చేయనున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.పిడతా పోలూరు లోని కొన్ని కాలనీలలో లో విద్యుత్తును అధిగమించి రానున్న రెండు నెలలలో సరైన విద్యుత్తును అందించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులు సజావుగా సాగుతున్నాయని,తెలిపారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, జలజీవన్ మిషన్, అంగన్వాడి సెంటర్, ఆరోగ్య కేంద్రం, డ్రిప్ ఇరిగేషన్, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, గ్రామస్తులతో ముఖాముఖి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ, అనిమల్ హస్బెండరీ, సేర్ఫ్ కార్యక్రమాల ను వీక్షించిన అనంతరం స్థానిక సచివాలయం వద్ద ప్రజల నుండి అర్జులను స్వీకరించారు. అధికారులు గ్రామంలో గుర్తించిన పలు సమస్యల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ పలువురు గ్రామస్తులు తెలిపిన గ్రామ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్జీలు స్వీకరిణ అనంతరం పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత 70 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న పల్లె కాపులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. సహజసిద్ధంగా ఎరువులు తయారు చేస్తున్న సహాయక గ్రూపు మెంబర్ కళ్యాణికి ప్రభుత్వం తరఫునుంచి ఆర్థిక సహాయం చేసి వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడడం జరుగుతుందన్నారు. పిడత పోలూరులోని కొన్ని ఎస్టీ కాలనీలలో లో విద్యుత్ ఉన్నందున ఆ సమస్యను అధిగమించే విధంగా త్రీ పేజ్ లైన్ ఏర్పాటు చేసి రెండు నెలలలో విద్యుత్ సమస్యను అధిగమించడం జరుగుతుందన్నారు. పల్లె వీక్షం కార్యక్రమం ద్వారా రెండు రోజులు ముందుగానే స్థానికంగా ఉన్న మేజర్ సమస్యలు, స్థానిక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

❖ రానున్న వారం పొదలకూరు మండలంలో పల్లె వీక్షణం కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. పిడత పోలూరులో దాదాపుగా ప్రధాన సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగుతుందన్నారు. జల ధార జలహారతి కార్యక్రమం ద్వారా కాలువల పూడికి తీరు పనులు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా సక్రమంగా జరుగుతున్నాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామీణ నీటి సరఫరా ద్వారా మంచినీటిని రెండు వారాలలో అందజేస్తామన్నారు. రోడ్లు భవనాలు బీటి లేయర్‌తో రోడ్లు వేయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురు లబ్ధిదారులయిన పెంచలమ్మ, శీనయ్య తదితరులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. అదేవిధంగా వెంకటమ్మకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ను అందజేశారు. తొలుత సచివాలయం వద్ద డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్వయ సహాయక గ్రూపు సంఘాలకు నాలుగు లక్షల చెక్కులను అందజేశారు. అదే విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పిఎండిఎస్ విత్తనాలను అందజేశారు. అనిమల్ హస్బెండ్రీ శాఖ ద్వారా ఫీడర్ కిట్లను లబ్బిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, డిఆర్‌డిఎపిడి నాగరాజ కుమారి, ఐటీడీఏ పీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్యశాఖ అధికారి సుజాత, వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ రాఘవేంద్ర, డీఈవో బాలాజీ రావు, వివిధ శాఖల అధికారులు, మండల రెవెన్యూ అధికారి స్వప్న, మండల పరిషత్ అధికారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ తొలి విడత ఆర్థిక సహాయం విడుదల

- జిల్లా రైతులకు రూ.117.16 కోట్ల ఆర్థిక సహాయం - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభతవార్త** 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్నదాత సుఖీభవ ప్రధాన్ మంత్రి కిసాన్ పథకాల తొలి విడత ఆర్థిక సహాయాన్ని ఈ నెల 20వ తేదీన విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,77,545 మంది రైతులు ఏడిఎస్‌బి పథకం కింద, 1,41,921 మంది రైతులు పిఎం కిసాన్ 23వ విడతకు అర్హత పొందినట్లు తెలిపారు. ఏడిఎస్‌బి పథకం ద్వారా రైతులకు రూ.5,000 చొప్పున, పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతుందని పేర్కొన్నారు.

**- నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు ఆర్థిక సహాయం వివరాలు:**

ఉదయగిరి - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 45,275 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 37,021 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.30.04 కోట్లు, ఆత్మకూరు - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 34,223 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 28,633 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.22.83 కోట్లు, కావలి - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 18,305 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 13,632 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.11.87 కోట్లు, కోవూరు - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 16,938 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 12,161 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.10.90 కోట్లు, సర్వేపల్లి - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 27,958 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 22,610 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.18.50 కోట్లు, నెల్లూరు - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 5,299 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 4,111 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.3.47 కోట్లు, వెంకటగిరి - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 16,015 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 12,921 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.10.59 కోట్లు, గూడూరు - ఏడిఎస్‌బి లబ్ధిదారులు 13,532 మంది, పిఎం కిసాన్ లబ్ధిదారులు 10,832 మంది, మొత్తం ఆర్థిక సహాయం రూ.8.93 కోట్లు జమ కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన రైతులకు కలిపి సుమారు రూ.117.16 కోట్ల ఆర్థిక సహాయం విడుదల కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు తమ భూవివరాలు, కుటుంబ సర్వే వివరాలు, బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నట్లయితే అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌గా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహించబడతాయని, రాష్ట్ర స్థాయి కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, లింగంగుంట గ్రామంలో మధ్యాహ్నం 3 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించబడుతుందని వివరించారు. అదే విధంగా జాతీయ స్థాయిలో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీ జిల్లా, తారకేశ్వర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందువల్ల రైతు సోదరులు అందరూ తమ తమ నియోజకవర్గాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కలెక్టర్ కోరారు.

## నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 850 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

- గత పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ఈ రెండేళ్లలో చేశా - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

- అధైర్యపడవద్దు కార్యకర్తలందరికీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అండగా ఉంటాడు - రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 850 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, గత పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ఈ రెండేళ్లలో చేశామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన 2 ఏళ్ళ నమ్మకం అభివృద్ధి సంక్షేమం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొని మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి 850 కోట్ల రూపాయల నిధులు తెచ్చాడంటే దానికి కారణం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుభవమన్నారు. ఒకే వేదికపై కూటమి నాయకులందరినీ కలుపుకొని ఒక్కతాటిపైకి తీసుకువచ్చిన ఘనత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిదని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జెండా మోసిన కార్యకర్తలను ఎప్పటికి మర్చిపోనన్నారు. జనం మధ్యలో ఉండేవారే నా దృష్టిలో నాయకుడదని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో వచ్చే వ్యక్తులకు టిక్కెట్లు ఇచ్చే ప్రశ్నే లేదు. పార్టీకోసం కష్టం చేసిన వారికే టిక్కెట్లు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో వచ్చే వ్యక్తులకు టిక్కెట్లు ఇచ్చే ప్రశ్నే లేదు. పార్టీకోసం కష్టం చేసిన వారికే టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. గత రెండు ఎన్నికల్లో గెలిచినా రాని మజా మూడవసారి వేలకోట్ల కోటేశ్వరుడి మీద గెలిస్తే నాకు మజా వచ్చిందన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి అడుగడుగునా సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి, యువనేత నారా లోకేష్‌కి, ఆయా శాఖల మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, జెన్ని రమణయ్య, జనసేన పార్టీ నాయకులు చిట్టమూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, దుగ్గిశెట్టి సుజయ్ బాబు, నూనె మల్లికార్జున యాదవ్, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, ఎర్రబోలు రాజేష్, విజయ్ కుమార్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు

- యూరియా కొరతను నివారించుకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం - మాజీ మంత్రి కాకాణి



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 19, ప్రభాతవార్త** యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలను నియంత్రించి, యూరియా కొరతను నివారించాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో యూరియా కొరతపై వైసిపి నాయకులు, ఆ పార్టీ రైతు సంఘం నాయకులతో కలిసి శుక్రవారం కాకాని గోవర్ధన్ రెడ్డి నెల్లూరులోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ఆ శాఖ ఏడిఏ సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో యూరియా కొరత లేదన్నారు. జిల్లాలో ఎడ గారు సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు కనీసం యూరియా కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. యూరియా కొరత పట్ల కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. అన్నదాతలు రోడ్డెక్కి యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్‌లలో నిలబడాల్సిన దుస్థితి రావడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని విమర్శించారు. కూటమి నేతలు నిద్ర మత్తు వదిలి క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరారు. యూరియా సమస్య పరిష్కారం కాకుంటే రైతుల పక్షాన నిలబడి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, రూరల్ ఇన్చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు బూత్ స్థాయి ఏజెంట్లుగా వ్యవహరించరాదు

- ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ఏ వ్యక్తి అయినా బూత్ స్థాయి ఏజెంట్ గా వ్యవహరించడానికి అనుమతి లేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా బూత్ స్థాయి ఏజెంట్లుగా నియమించబడినా లేదా ఆ బాధ్యతలను నిర్వహిస్తున్నా, వెంటనే ఆ కార్యకలాపాలను నిలిపివేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించి బూత్ స్థాయి ఏజెంట్‌గా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులపై సంబంధిత చట్టాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

అందువల్ల అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించి ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో కోరారు.

## మైనింగ్ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ



**సైదాపురం, జూన్ 19, ప్రభాతవార్త** మండల పరిధిలోని తుమ్మలతలుపూరు గ్రామ సమీపంలో నెల్లూరు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమక్షంలో శుక్రవారం మైనింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్‌కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల పరిధిలోని పెరుమాళ్ళపాడు గ్రామంలోని సర్వే నంబర్లు 142, 143ఎ లో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో సుమారు 3.197 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహించేందుకు శ్రీగంగోడ నాగేశ్వరరావు కంపెనీ వారు ప్రభుత్వ అనుమతుల కొరకు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాన్ని స్వీకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా శ్రీగంగోడు నాగేశ్వరరావు కంపెనీ వారికి మైనింగ్ అనుమతులు ప్రభుత్వం ద్వారా ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, కంపెనీ యాజమాన్యం గంగోడు నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎన్జీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నెల్లూరు రూరల్లో టీడీపీలోకి జోరుగా చేరికలు

### ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు



**నెల్లూరు రూరల్, జూన్ 19 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ బలోపేతానికి మరో అడుగు పడింది. నేడు ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 1వ డివిజన్ నారాయణరెడ్డిపేటకు చెందిన షేక్ మోలాలి మరియు ఆయన మిత్రబృందం తెలుగుదేశం పార్టీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా, పదిమందికి మేలు చేసే విధంగా పనిచేయాలని కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు సూచించారు. ప్రజా సేవలో ముందుండే ప్రతి ఒక్కరికీ తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తనను విశ్వసించి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

❖ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై నడుస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు.

❖ ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కుడుముల చిరంజీవి, కోక్లస్టర్ ఇంచార్జ తమ్మి శ్రీనివాసులు, కోడూరుపాడు పీఏసీఎస్ చైర్మన్ గంగి జయరామి రెడ్డి, యనమల హరిబాబు యాదవ్, షేక్ మక్తూరు, షేక్ ముస్తాక్, ఎర్రా ధనుంజయ, కన్నా బ్రహ్మయ్య, చొప్పా శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



**అల్లూరు, జూన్ 19 ప్రభాతవార్త :** అల్లూరుపేటలోని పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ జడ్పి హైస్కూల (సుబ్బయ్యబడి) లో శుక్రవారం 2026 విద్యా సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ పణికుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదవ తరగతిలో 558 మార్కులతో మొదటి స్థానం పొందిన జి.రితీష్‌కుమార్‌కు రూ.10వేలు, గంగపట్నం బాలసుబ్రమణ్యం ఏడం వేణుగోపాల్‌రెడ్డికి రూ.2వేలు, పొట్లూరు చెంచయ్యగారి తండ్రి జ్ఞాపకార్థం రూ.2వేలను అందజేశారు. కెవిఎన్ శ్రావతి 551మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి ఏడం వేణుగోపాల్‌రెడ్డి రూ.2వేలు పొట్లూరు చెంచయ్య వారి తండ్రి జ్ఞాపకార్థ రూ.2వేలు, జి.శృతి 512మార్కులతో తృతీయ స్థానం పొందిన విద్యార్థికి మేడ శ్రీనివాసులురెడ్డి రూ.1000లు చొప్పున బహుమతులు అందజేశారు. ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పొట్లూరు చెంచయ్య వారి తండ్రి జ్ఞాపకార్థం2025నుంచి ప్రతి ఏడాది పదవ తరగతిలో 550మార్కులు పైన సాధించిన విద్యార్థులకు రూ.2వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రక్కు ఢీకొని వ్యక్తి మృతి

**సీతారామపురం జూన్ 19 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని బోడసిద్దాయపల్లి గ్రామం వద్ద శుక్రవారం ఉదయం రోడ్డుపక్కన నిలబడి వున్న వ్యక్తిని మహేంద్ర మిని ట్రక్కు ఢీకొని  మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు బోడ సిద్దాయ్యపల్లి గ్రామానికి చెందిన భువనబోయిన నాగరాజు (42) అనే వ్యక్తి రోడ్డు పక్కన వుండగా అదే సమయానికి సిఎస్ పురం నుండి మైదుకూరుకు వెళుతున్న మహేంద్ర మిని ట్రక్కు నాగరాజును వెనుక నుండి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయామైంది. వెంటనే 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వెంకట రాజేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడుకి బార్య,కుమారుడు.,కుమార్తె ఉన్నారు.

## వార్త కథనానికి స్పందించిన డీఎంహెచ్ఓ

### - అనుమతులు లేని క్లినిక్‌పై వైద్యాధికారి దాడి, మందులు స్వాధీనం



**ఇందుకూరుపేట, జూన్ 19, ప్రభాతవార్త** మండలం లోని (కుడితిపాలెం) గ్రామంలో అర్హత లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపి, పిఎంపిలు క్లినిక్ నడుపుతున్నట్లు వార్తాపత్రికలో వచ్చిన కథనంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తీవ్రంగా స్పందించారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శుక్రవారం కుడితి పాలెంలోని శ్రీ సాయిరాం క్లినిక్ పై ఆకస్మికంగా దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో క్లినిక్‌కు సంబంధించిన పత్రాలను, అక్కడ వైద్యం అందిస్తున్న వారి అర్హత సర్టిఫికెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్లినిక్ నిర్వహణకు సంబంధించిన పత్రాల గడువు ముగిసినప్పటికీ, వాటిని తిరిగి రెన్యువల్ (నవీకరణ) చేసుకోకుండానే చట్టవిరుద్ధంగా క్లినిక్ నడుపుతున్నట్లు వైద్యాధికారి గుర్తించారు.

**- నోటీసులు జారీ - యాంటీ బయాటిక్స్ స్వాధీనం** అర్హత, అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేస్తూ సదరు నిర్వాహకులకు వైద్యాధికారి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల నుండి తిరిగి అనుమతులు వచ్చే వరకు క్లినిక్‌ను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. అలాగే క్లినిక్‌లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడానికి ఉంచిన పలు రకాల యాంటీబయాటిక్ మందులను వైద్యాధికారి స్వాధీనం చేసుకున్నారు.

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు** ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డీఎంహెచ్ఓ ఆదేశాల ప్రకారం మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వచ్చే ముదివర్తిపాలెం, నిడిముసలి, కుడితిపాలెం, రాముడుపాలెం, గంగపట్నం, మైపాడు, కొరుటూరు, నరసాపురం, సోమరాజుపల్లి, పున్నూరు, రావూరు, కొమరిక తదితర గ్రామాలలో ఎవరైనా ఆర్ఎంపి, పిఎంపిల పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా క్లినిక్‌లు నడిపినా, నిబంధనలు దాటి మందులు అమ్మినా సహించేదిలేదన్నారు.

❖ అలాంటి కేంద్రాలన్నింటినీ త్వరలోనే తనిఖీ చేసి, పూర్తి క్షేత్రస్థాయి సమాచారాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి నివేదిస్తామని చెప్పారు. అనంతరం వాస్తవ, అవాస్తవాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి హెచ్చరించారు.

## ఓటరుజాబితా ప్రత్యేక సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీఓ



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో జరుగు తున్న ఓటరు జాబితా ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని ఆర్డీఓ ఎలీషాకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ముసునూరు 122, 132 పోలింగ్ స్టేషన్, దంతం వారిపల్లె వీది 103 పోలింగ్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని కల సూపర్‌వైజర్లు, బిఎల్ఓలు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహిస్తున్నారా, దరఖాస్తు ఫారాలను నింపుతున్నారా అర్హులైన ఓటర్ల నుంచి అవసరమైన ధృవీకరణ పత్రాలను సేకరిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ఓటర్ల వివరాల నమోదు సవరణ, మార్పులు, మరియు ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్లందరూ బిఎల్ఓకు సహకరించాలని అవసరమైన పత్రాలను అందజేసి తమ ఓటుహక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**గూడూరు, జూన్ 19, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నుండి గత వైసీపీ ప్రభుత్వంలో ఎవ్వరికీ ఎటువంటి సహాయం అందించలేదని ఎంతోమంది పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో పార్టీలకతీతంగా సీఎం సహాయనిధి, ఎల్ఓసిలు అందించామని సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రజలు గుర్తుంచుకోవాలని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని మరలా గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, రహీం, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, శివకుమార్, మసూదన్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం




**రాపూరు, జూన్ 19, ప్రభాతవార్త :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకోని రాపూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యోగా సాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల జాతియ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గోని వివిధ యోగాసనాలను అభ్యసించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ వి.హనుమంతయ్య మాటాల్డఉతూ యోగ భారతదేశానికి ప్రపంచానికి అందించిన గోప్ప వరమని పేర్కోన్నారు.యోగా సాధన ద్వారాశారీరక, మానసిక ఆరోగ్యం మెరుగపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతఉందని తెలిపారు. నేటి యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలంటే యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వయంగా కోన్ని యోగాసనాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

**ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వి.మల్లిఖార్జున మాట్లాడుతూ** యోగా సాధన విద్యార్థుల జ్ఞాపకశక్తి,ఏకాగ్రత మరియు మానసిక స్థైర్యాన్ని పెంపోందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. చదువుతో పాటు యోగాభ్యాసాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు ఆర్. వసంత రావు, కె. సుమతి, సిబ్బంది దేవహర్స్, వెంకటరమణమ్మ, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గోన్నారు. అనంతరం అంతర్జాతియ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకోని విద్యార్థులు, అధ్యాపకులకు స్వీట్లు పంపిణీ చేశారు.

## వరిగొండ గ్రామసభలో ఏకీకృత కుటుంబ సర్వే వివరాల ప్రదర్శన



**తోటపల్లి గూడూరు, జూన్ 19, ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి శిరీష రాణి గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిర్వహించిన ఏకీకృత కుటుంబ సర్వే వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సర్వే ద్వారా ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించినట్లు ఆమె తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, కులం, వృత్తి, సామాజిక, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సేకరించిన సమాచారాన్ని గ్రామ ప్రజల పరిశీలన కోసం శుక్రవారం నుంచి జూన్ 24వ తేదీ వరకు గ్రామ సచివాలయంలో ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ఏకీకృత కుటుంబ సర్వే ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబం గురించి సమగ్ర సమాచారం ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తుందని, తద్వారా సంక్షేమ పథకాల అమలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ఆమె వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో ఈ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సర్వేలో నమోదైన వివరాల్లో ఏవైనా పొరపాట్లు, లోపాలు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే గ్రామస్తులు జూన్ 24వ తేదీలోపు గ్రామ సచివాలయంలో తెలియజేసి సరిచేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు శిరీష రాణి పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన మార్పులు చేయించుకోవాలని ఆమె సూచించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, విజయ డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసులు రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామసభలో సర్వేకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## మా పంట పొలాలక రక్షణ కల్పించండి



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** మా పంట పొలాలకు పొదుపు మహిళల నుంచి రక్షణ కల్పించాలని శుక్రవారం రూరల్ మంలం చెన్నాయపాలెం, పెద్దపటటపు పాలెం గ్రామాల రైతులు స్తానిక ఆర్డీఓ ఎలీషాబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్రిమాదవరావు, నాగన్న గారి శ్రీనివాసులు, ప్రళయ కావేరి ఏడుకొండలు, రాములు తదితరులు మాట్లాడుతూ కొన్ని ఏళ్ళక్రితం విడతల వారీగా చెన్నయపాలెం, పెద్దపట్టపుపాలెం పంచాయితీల గ్రామస్థులకు దాదాపు 150మందికి పెద్దపట్టపు పాలెం సమీపాన బీపామ్‌పట్టాలు ఇవ్వడం జరిగిందిన్నారు. గత 40ఏళ్ళుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. గత కొన్నిరోజుల క్రితం చెన్నయపాలెం, పెద్దపటపాలెం, పంచాయితీలకు సంబంధించిన పొదుపు మహిళలుమాకు సంబంధించి పొలాలు వాళ్ళవని మాపై దాడులు చేసి పంటపొలాల్లోని పైపులను పగలుకొట్టి, మోటార్లను కూడా ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పొదపు మహిళల వద్ద ఎటువంటి అధికారిక పత్రాలు లేవని తెలిపారు. ఆన్‌లైన్‌లో వన్‌బి అండగల్‌లో కూడా నమోదు కావడం జరిగిందన్నారు. 493,494, 495, 401, 457, 458,459, 491,492సర్వేనెంబర్లలో మా పొలాలను పొందుపరిచి ఉన్నారన్నారు. రైతులు పండించుకొని జీవిస్తుంటే ఈ విధంగా దడులు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. వారి వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పంట పొలాలపై దాడులు చేయడం సమంజసం కాదన్నారు. మా పొలాలకు మాకు రక్షణ కల్పించాలని వారు కోరారు. బిపిసిఎల్ కంపెనీకి మా భూములు ఇవ్వడం జరిగిందని కొంతమంది రైతులకు పరిహారం అందలేదని ఆ పరిహారాన్ని కూడా ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎన్జీజివో సంఘం గళం

### - 16 ఏళ్ల తర్వాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

### ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మరో కీలక ముందడుగు



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ విజయకుమార్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించ బడింది. ఈ సమావేశానికి 15 సభ్య సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే ఏపీ ఎన్జీజివో సంఘం ఈ సమావేశంలోనూ తన ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని చాటుకుంది. సంఘ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మలేరియా కార్యాలయం, కమర్షియల్ టాక్స్, ఇరిగేషన్, సోషల్ వెల్ఫేర్, ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్, వ్యవసాయ శాఖ, కోఆపరేటివ్ శాఖ, పెన్షనర్స్, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ సచివాలయాలు తదితర శాఖలకు చెందిన మొత్తం 51 సమస్యలను సమగ్రంగా ప్రస్తావించి ఉద్యోగుల తరఫున తన గళాన్ని బలంగా వినిపించారు.సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన జిల్లా డిఆర్ఓ, అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, త్వరలో అన్ని శాఖల హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్‌తో ప్రత్యేక జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దాదాపు 16 సంవత్సరాల తర్వాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించిన డిఆర్ఓని ఏపీ ఎన్జీజివో సంఘం తరఫున ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. కిరణ్ కుమార్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆంజనేయ వర్మ, ఆర్గనైసింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ కె. సురేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ టి. మల్లికార్జున రావు, నెల్లూరు సిటీ కార్యదర్శి ఏ.వి. కృష్ణ కుమార్ పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార మార్గాలను చూపిస్తూ, ప్రతి ఉద్యోగికి అండగా నిలుస్తున్న ఏపీ ఎన్జీజివో సంఘం మరోసారి తన కార్యదీక్షను, సంఘ బలాన్ని, నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకుంది.

## పీఓఏ చట్టంపై వర్క్ షాప్ అవగాహన సదస్సు

### - ముఖ్య అతిథులకు హాజరైన డి.ఎస్.పి జి. శ్రీనివాసులు




**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరులోని బట్వాడిపాలెం ఎస్ఎస్ గ్రాండ్ హోటల్ వేదికగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచారాల నిరోధక చట్టం – 1989 పై అవగాహన వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా జరిగింది. నెల్లూరు నగర కమిటీ అధ్యక్షురాలు సిహెచ్ నాగ మణి నేతృత్వంలో మహిళా బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా హాజరైన నెల్లూరు రూరల్ డీఎస్పీ జి. శ్రీనివాసులు మాట్లాడుతూ పీఓఏ యాక్ట్ మరియు పీసీఆర్ యాక్ట్ లక్ష్యాలను వివరించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన వారికి బెస్ట్ సర్వీస్ అవార్డు గ్రహీతలుగా ఎంపిక చేసి ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు ప్రదానోత్సవం చేయడం జరిగింది.

**– చట్టం ఆయుధం,** అజ్ఞానం శత్రువు చట్టం తెలిసినవారికి అది రక్షణ కవచం, తెలియని వారికి అన్యాయం కొనసాగుతుంది అని డీఎస్పీ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే కుల వివక్ష, భూ ఆక్రమణలు, బెదిరింపులు, బహిరంగంగా అవమానించడం, మహిళలపై వేధింపులు వంటి 37 రకాల నేరాలను పీఓఏ చట్టం గుర్తిస్తుందని వివరించారు. నేరం రుజువైతే 6 నెలల నుండి యావజ్జీవం వరకు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

**– మహిళల భద్రతకు ప్రాధాన్యం** మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు పీఓఏ చట్టం కింద తీవ్రమైన నేరాలని స్పష్టం చేశారు. బాధితులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, 60 రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, ప్రత్యేక కోర్టుల ద్వారా సత్వర న్యాయం అందించడం ఈ చట్టం ప్రత్యేకత అని తెలిపారు. బాధిత మహిళలకు ప్రయాణ ఖర్చులు, వైద్య ఖర్చులు, పునరావాసం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ దళిత నేతలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

## మోడీ పాలన భారత్‌కి ఒక స్వర్ణ యుగం...

### తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్‌డి.విల్సన్



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** జవహార్‌లాల్‌నెహ్రు తరువాత ఎక్కువ కాలం దేశాన్ని పాలించిన మహానేత నరేంద్ర మోడీ అని ఆయన పాలన ఒక స్వర్ణయుగమని తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డివిల్సన్ తెలిపారు. కచేరిమిట్టలోని ఆర్‌డి.విల్సన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచాన్ని ఏక ధ్రువ ప్రపంచంగా మార్చడంలో నరేంద్రమోడీ చూసిన దార్శినికత అనితర సాధ్యం అన్నరు. భారత్‌ను విశ్వగురుగా నిల్పడంలో ఆయన చూపించిన నైపుణ్యం అద్భుతం అన్నారు. ఇరాన్‌తో యుద్ధం తరువాత ఆమెరికా బలహీన పడిందన్నారు. ఉక్రెయిన్ యుద్ధం తరువాత రష్యా బలహీనపడింది అన్నారు. నరేంద్రమోడీ ప్రభత్వం 26 ముఖ్యమైన పథకాలను ప్రారంభించింది అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో బిజెపి అధికారం చేపడతాం అన్నారు. ఏపిలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే ఏపిలో పాతిక లక్షల కోట్లు నిధులు విడుదల కేటాయించబడ్డాయి అన్నారు. విశాఖ రైల్వేజోన్, విశాఖస్టీల్ ప్లాంట్‌తో పాటు అమరావతి నిర్మాణంకు నిధులు కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, జిల్లా టెలికం అడ్వైయిజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రాహ్మనందం, పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్, లక్కరాజు భాస్కర్, దళితమోర్చా రాష్ట్ర నేత పరుసు వెంకటేశ్వర్లు, యువమోర్చా నేత రాకేష్ సుభాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి పట్టణం నివాసులు కానిస్టేబుల్ షేక్‌బాబుల్, రమీజ్ దంపతుల పెళ్ళిరోజు సందర్భంగా శుక్రవారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర అద్వర్యంలో పట్టణంలోని వైకుంఠపురం, బాలక్రిష్ణారెడ్డి నగర్‌లోని నిరుపేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, బియ్యం కూరగాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు షేక్‌బాబుల్, రమీజ్ దంపతులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా తమ ఇంటిలో జరిగే శుభకార్యాలకు పేదలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో బాగంగానే పెళ్లిరోజును పురష్కరించుకొని నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా పేదలకు పలు సేవలందిస్తామని తెలిపారు. సంస్థ వ్యవస్తాపకుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థచే నిరుపేద కుటుంబాలకు నిత్యవసర వస్తువులు బియ్యం కూరగాయలు, పంపిణీ చేసిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.

## డాబాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** మంగళగిరి డైరెక్టర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎకైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు వింగ్ పి.దయాసాగర్ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కావలి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకటరావు సిబ్బంది కలసి శుక్రవారం డాబాలన్నింటిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా జలదంకి మండలం జమ్మలపాఎం సమీపంలో ఉన్న ఆర్‌అర్‌డాబా వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగింది. బ్రాహ్మనక్రాక నుంచి గుడ్లదునకు వెళ్ళే మార్గంలో ఓ మహిళ వద్ద 180 ఎంఎల్ ఏడు మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని కేసు నమోఆఉ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ వెంకట్రావు మాట్లాడారు. డాబాలలో మద్యం విక్రయాలు జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.ప్రసన్నకుమార్, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి రెడ్‌క్రాస్ ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం




**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినత్సవాన్ని రెడ్‌క్రాస్ తల సేమియా వైద్యశా లలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా తలసేమియా డేకేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పాపూరు శ్రీధర్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనేది తలసేమియా లాంటి ఒక జన్యుపరమైన వ్యాధి అని ఇది తల్లిదండ్రుల ద్వారానే పిలలలకు సంక్రమిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి గ్రస్తులలో ఎర్రరక్త కణాలు కొడవలి, చంద్రవంక ఆకారంలోకి మారిపోతాయని వివరించారు. దీంత బాధితులకు విపరీతమైన నొప్పులతో తీవ్రంగా బాదపడతారని తెలిపారు. ఇలాంటి వారు తలసేమియా ఆసుపత్రిని సంప్రదిస్తే ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికు మార్, ఛైర్మెన్ డి.రవిప్రకాష్, వైస్‌ఛైర్మెన్ కె.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు తల్లికి శ్రీహరిరెడ్డి, బెజవాడ ప్రసన్నకుమార్, రోటరీ క్లబ్ ప్రముఖులు డాక్టర్ కె.మాధవరెడ్డి, నల్లూరు రవికుమార్, తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వాహక కమిటీ సభ్యులు కల్లయ్య, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ జి.హరనాథ్ పాల్గొన్నారు.

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నందు ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గం వినతి

### - ఈహెచ్ఎస్ నెట్ వర్క్ హాస్పిటల్స్‌తో పాటు ఆరోగ్యమిత్రల తాజా జాబితా ప్రచురించాలి



నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త నెల్లూరు నగరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని శంకరణ్ హాల్‌హాల్ నందు జిల్లా రెవిన్యూ అ ధికారి ఎన్‌విజయ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరి గింది. జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు బి సుధాకర రెడ్డి, పివిఎస్‌టి రాంప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ హెచ్ ఎస్ నెట్ వర్క్ హాస్పిటల్స్‌తో పాటు ఆరోగ్యమిత్రల తాజా జాబితా అన్ని శాఖల ఉద్యోగులు మరియు పెన్షనర్లకు అందుబాటులో ఉండేలా అన్ని కార్యాలయాలకు సమాచారం ఇస్తూ, వెబ్సైట్లో కూడా డిజిటల్‌గా ప్రచురించాలనికోరారు. జిల్లా స్థాయిలో పదోన్నతులు ఇచ్చిన వెంటనే, క్రింది స్థాయిలో ఎప్పటికప్పుడు సాధారణ లేదా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ తద్వారా ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని వివరించారు.

## మున్సిపల్ కార్మికులని పర్మినెంట్ చేయాలి

### నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వినతిపత్రం





**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 19 ప్రభాతవార్త :** మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ ఆపి ఏళ్ళ తరబడి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేస్తూ ఏపీ మునిసపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కెవిఆర్.పెట్రోల్ బంకు నుంచి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ కార్పోరేషన్లు మున్సిపాలిటీలలో పౌరసేవలు ప్రైవేటీకరణ పేరుతో 14కీలక విభాగాలను ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన 975, 673 జీఓలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల హైకోర్టు శాశ్వత స్వభావం కలిగి పదిఏళ్ళు పైబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని తీర్పు ఇచ్చింది. గతంలో సుప్రింకోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పులను అమలు చేయపోగా పట్టణ ప్రాంతాల్లో పౌరసేవలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలు వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ఈపద్దతి అమలు జరిగితే మున్సిపల్ కార్మికులకు పనిభద్రత ఉండదు ఎప్పటికైనా పర్మినెంట్ కాకపోతాయా అనే అశతో ఎదురు చూస్తున్న కార్మికులకు కూటమి ప్రభుత్వం మొండిచెయి చూపుతున్నదని తెలిపారు. ఇప్పటికే 60ఏళ్ళు నిండాయి అనే కారణంతో ఒక్క రుపాయి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. మా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృషిటకి తీసుకెలుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, ఎం.సుధాకర్, ఎస్.మాలకొండయ్య, సురేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సునీల్, దేశమూర్తి, వజ్రమ్మ, సుజాతమ్మ, అశోక్, రమాదేవి, ఏడుకొండలు, నాగేశ్వరరావు, రాంబాబు, చెన్నయ్య, రవి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరు మండలంలో ప్రత్యేక తనిఖీలు

**- అక్రమ మద్యం విక్రయం, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు**



**చిల్లకూరు, జూన్ 19, ప్రభాతవార్త** ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం చిల్లకూరు మండల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లిపేడు గ్రామంలోని చెరువుకట్ట వద్ద నిర్వహించిన తనిఖీలలో పి.వేణుమురళి అను వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 8మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, అతనిపై బెల్ట్‌షాపు కేసు నమోదుచేశారు. అలాగే, కడివేడు గ్రామంలో నిర్వహించిన తనిఖీలలో వై. సురేష్ అను వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ పట్టుబడగా, అతనిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఎక్సైజ్ శాఖ నిరంతర తనిఖీలు నిర్వహి స్తుందని, ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీలలో పి. మహేష్, సబ్ ఇన్స్పెక్టర్, బి. వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్, ఎస్. సిహెచ్. మస్తానయ్య, కానిస్టేబుల్, ఎ. శ్రీరాములు, కానిస్టేబుల్, ఎం. రవి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## అల్లూరు శేషయ్య హత్య కేసును ఛేదించిన పోలీసులు

## - నిందితులు అరెస్టు

**ముత్తుకూరు, జూన్ 19, ప్రభాతవార్త** ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోనిముత్తుకూరు మండలంలోని పొట్టెంపాడు గ్రామ సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద ఈ నెల 17వ తేదీ జరిగిన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ప్రధాన నిందితుడిని, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడిన ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ముత్తుకూరు పోలీసులు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు (ఏ1) అయిన కోట మండలంలోని తిమ్మలూరిపాలెం గిరిజన కాలనీకి చెందిన కుడుముల సుబ్బరాయులు కుమారుడు అశోక్(29) అని పోలీసులు తెలిపారు. అలాగే చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడిన తడమండలంలోని మాంబట్టు యానాది కాలనీకి చెందిన అవులూరు అంకయ్య కుమారుడు అవులూరు కుమార్ (17)లను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. ఈ నెల 17 తెల్లవారి జామున ముత్తుకూరు మండలంలోని పొట్టెంపాడు గ్రామ సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద పని చేస్తున్న అల్లూరు శేషయ్య (70) హత్య విషయంలో తెలిసిన వివరాలు మేరకు నిందితులు, మృతుడు అల్లూరు శేషయ్య మధ్య వ్యక్తిగత వివాదం చోటుచేసుకుందన్నారు. ఈ వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరుకోవడంతో నిందితులు కక్ష పెంచుకొని మృతుడిని హత్య చేయాలని పథకం వేశారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున సుమారు 1.00 గంటల సమయంలో మృతుడు తన గుడిసె బయట కూర్చుని ఉండగా నిందితులు అక్కడికి చేరుకొని అతనిపై కత్తితో, కర్రలతో దాడి చేయగా, శేషయ్య అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనపై మృతుని బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.62/2026గా భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) ఆర్/డబ్ల్యూ 3(5) కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, జిల్లా అదనపు ఎస్పి సిహెచ్. సౌజన్య పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ డి.ఎస్.పి జి. శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో కృష్ణపట్నం పోర్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్ఐలు తమ బృందాలతో 24 గంటలలో నేరస్థులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. తదనంతరం ఈ నెల 18వ తేదీ విశ్వసనీయ సమాచారం మేరకు ముత్తుకూరు మండలంలోని ఏపీ జెన్‌కో రోడ్ వద్ద పెట్రోల్ బంక్ వద్ద నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తమ విచారణలో నిందితులు తాము చేసిన నేరాన్ని అంగీకరించడంతో వారిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు రిమాండ్ కై హాజరుపరిచామన్నారు. ప్రాథమిక దర్యాప్తులో వ్యక్తిగత కక్ష, అవమాన భారం కారణంగానే ఈ హత్యకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. కేసుకు సంబంధించి మరికొంతమంది సాక్షులను విచారించాల్సి ఉందని, ఈ కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఏపీ ఏఐఎమ్ఎస్ యాప్ పట్ల రైతులకు అవగాహన కల్పించండి



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త - అగ్రికల్చర్** నెల్లూరు జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్న విషయంపై వాస్తవాలు అర్థమయ్యేలా రైతులకు వివరించాలని బిజెపి నేత మిడతల రమేష్, వ్యవసాయ శాఖ అధికారులకు విజ్ఞప్తిచేశారు. శుక్రవారం ఆయన నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయలో ఏడిఏ సుజాతకు యూరియా దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లా ఆదురుపల్లిలో 1423 అదనపు యూరియా బస్తాలను విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీజ్ చేయడం చూస్తే రైతులకు అందాల్సిన యూరియా పక్కదోవ పడుతున్నట్టు అర్థమవుతుందని రమేష్ పేర్కొన్నారు. కౌలు రైతులకు, శివాయి భూములలో పంటలు వేసిన రైతులకు కూడా యూరియా అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌తో పాటు బిజెపి నేత నరాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**నెల్లూరు సిటీ, జూన్ 19, ప్రభాతవార్త** అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూల తేదీలను ప్రకటించినట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ సాధికారిత ధికారి హేన సృజన్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 13 అంగన్‌వాడీ వర్కర్లు, 10 మినీ అంగన్‌వాడీ వర్కర్లు, 204 అంగన్‌వాడీ సహాయకురాలు (హెల్పర్స్) ఖాళీల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులకు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డివిజన్ల వారీగా ఇంటర్వ్యూ తేదీల వివరాలు కావలి డివిజన్ ఈ నెల 23న, ఆత్మకూరు డివిజన్ ఈ నెల 24న, నెల్లూరు డివిజన్ ఈ నెల 27న అభ్యర్థులకు ముఖ్య గమనిక సంబంధిత సిడిపిఓ కార్యాలయాల నుండి ఇంటర్వ్యూ కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు, పైన పేర్కొన్న తేదీలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి హేన సృజన్ తెలిపారు.

## విద్యుత్ అంతరాయం

**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త - వైద్యం** 33/11 కెవి మహాత్మ గాంధీ నగర్ సబ్ స్టేషన్ నందు మరమ్మత్తుల కొరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఏఈ ఎం. శ్రీధర్ తెలిపారు. విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాలు సుజాతమ్మ కాలనీ, జెవిఆర్ స్ట్రీట్, లక్ష్మినరసింహపురం, లేక్ వ్యూ కాలనీ, ఆదర్ష నగర్, పొదలకూరు రోడ్ సర్కిల్, అంబేద్కర్ నగర్, బషీర్‌నగర్, కలెక్టర్ బంగ్లా, జడ్పీ ఆఫీస్,ప్రశాంతి నగర్, బారా షాహిద్ దర్గా, బ్రహ్మా నందపురం, నీలగిరి సంగం, బెజవాడ ఓబుల్ రెడ్డి నగర్, కొండాయపాలెం గేట్, కెవిఆర్ పెట్రోల్ బంక్, బట్వాడిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగును. వినియోగదారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవలసిందిగా కోరారు. అత్యవసర సేవలకు సంబంధించిన వారు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవలసిందిగా ఏఈ తెలిపారు.

## బైపాస్ రోడ్డుపై నేలకొరిగిన వృక్షాలు

**- రాకపోకలకు తీవ్ర అంతరాయం**



**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త** వింజమూరు జిబి కేఆర్ఎస్‌టి కాలనీ మీదుగా ఆత్మకూర్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు పై బుధ, గురువారాలలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి వృక్షాలు వేళ్ళతో సహా పెకలించుకుని నేలకొరిగాయి దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు సైడ్ రోలింగ్ పై పడటంతో రోలింగ్ పూర్తిగా వంగిపోయింది చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడటంతో ఒకవైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి సమాచారం అందుకున్న ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు జెసిబి సహాయంతో చెట్లను తొలగించారు. దీంతో రాకపోకలు జరుగుతున్నాయి.

## 23న అంగన్వాడి పోస్టులకు ఇంటర్వ్యూలు



**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త** వింజమూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వింజమూరు కలిగిరి కొండాపురం జలదంకి మండలాలకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాల పోస్టులకు మే నెల 7వ తేదీన దరఖాస్తులు స్వీకరించడం జరి గింది. దరఖాస్తు తీసుకున్న అభ్యర్థులలో అర్హత కలిగిన వారికి ఈ నెల 23వ తేదీన కావలి ఆర్డిఓ కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సిహెచ్ పద్మజకుమారి తెలిపారు. అందువల్లఇంటర్వ్యూకి సంబం ధించిన కాల్ లెటర్స్ అందుకున్న వారు తప్పకుండా 23వ తేదీన కావలి వెళ్ళ వలసి ఉందని ఆమె తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

## చెరువు కాదు.. ఇది రోడ్డే..!



**దగదర్తి, జూన్ 19, ప్రభాతవార్త** దగదర్తి మండలంలోని కట్టుబడిపాలెం నుండి చెన్నూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడి చెరువును తలపిస్తుంది. రాత్రి కురిసిన వర్షంతో గుంతలో నీరు నిలిచి ప్రమాద భరితంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. భారీ గుంత కావడంతో లోతు తెలియని వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రతి రోజు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షాల సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చి రహదారిని మరమ్మత్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగే ముందు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు కోరుతున్నారు.

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**- యుద్ధ ప్రాతిపదికన పునర్ధరణ పనులు**





**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త** వింజమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధ, గురువారం కురిసిన వర్షానికి తోడు వీచిన ఈదురుగాలుల దాటికి విద్యుత్ వ్యవస్థ అతలాకుతలమైంది. మండలంలో పలు గ్రామాలలో 35 నుండి 40 విద్యుత్ స్తంభాలు విరిగి నేల కొరకడంతో విద్యుత్ సరఫరా కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని కాటేపల్లి, ఒన్నోరప్పపాలెం, ఊటుకూరు, చా కలకొండ, నంది గుంట, వింజమూరు రూరల్ పరిధిలో ఈదుర గాలుల ప్రభావంతో అనేక చోట్ల భారీ వృక్షాల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో ఆబరువుకు తాళలేక స్తంభాలు వంగిపోయి పునాదులతో సహా కూలిపోయాయి. దీంతో ఆయా గ్రామాలలో బుధవారం రాత్రి నుండి విద్యుత్ సరఫరా పూర్తిగానిలిచిపోయింది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రు. గ్రామాలలో నెలకొన్న విద్యుత్ అంతరాయం పై ట్రాన్స్కో ఏఈ ఎస్‌కే నాగూర్ వల్లి వెంటనే తమ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి నష్టం వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ నాగవల్లి మాట్లాడుతూ ఊహించని విధంగా వీచిన ఈదురు గాలులకు సబ్ స్టేషన్ పరిధిలో 35నుండి 40స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. చెట్లు కొమ్మలు పడటంవల్ల ఎక్కువ నష్టం వాటిల్లిందని ఇప్పటికే తమ సిబ్బంది నూతన స్తంభాల ఏర్పాటు విద్యుత్తు తీగల లాగేపనులు చేస్తున్నారని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో విద్యుత్తును సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

## అక్రమ మద్యం స్వాధీనం : ముగ్గురు అరెస్ట్

**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త** నాలుగు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు కలిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్శ్నషన్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గత రెండు రోజులుగా కలిగిరి స్టేషన్ పరిధిలోని వింజమూరు, వివిధ గ్రామాల్లో చేపట్టిన దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి సంబంధిత కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై మూడు పబ్లిక్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడులకు కలిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిఐ షేక్ మొహమ్మద్ అబ్దుల్ జలీల్ , ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## డ్రైనేజీ గ్రిల్స్ పై రగడ...రోడ్డెక్కిన వ్యాపారులు



**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త:** వింజమూరు పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద ఎన్ హెచ్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ పై అమర్చిన గ్రిల్స్ తమ జీవన ఉపాధికి అడ్డంగా మారేయని స్థానిక వ్యాపారస్తులు శుక్రవారం బంగ్లా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనకుదిగారు. బంగ్లాసెంటర్లో గత 40 ఏళ్లగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నామని రెక్కాడితే గాని డొక్కాడని మేము రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ హెచ్ డ్రైనేజీ నిర్మించి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకుండా నేరుగా గ్రిల్స్ అమర్చడంతో తమ షాపులు ముందు వాహనాలు నిలిపే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికే పార్కింగ్ సౌకర్యం లేక వినియోగదారులు తమ దుకాణాలు రావడం లేదని దీనికితోడు గ్రిల్స్ ఏర్పాటుతో పూర్తిగా వ్యాపారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజ్ పై స్లాబులు వేసి రోడ్డుగా మారిస్తే వాహనాలు నిలపడానికి సరుకు దింపుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. వ్యాపారస్తుల ఆందోళనను తెలుసుకున్నామన్నారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గురజాల వాసు నాయుడు వ్యాపారస్తులతో మాట్లాడి విషయం తెలుసుకొని సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్తారని ఎవరు ఆందోళన చెందొద్దు అన్నారు. వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి 'ఆనం'కు ధన్యవాదాలు : బొల్లినేని ప్రభాకర్




**అనంతసాగరం, జూన్19, ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్న రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అనంతసాగరం మండలంలోని కచ్చేరిదేవరాయపల్లి తెలుగుదేశంపార్టీ గ్రామ అధ్యక్షుడు బొల్లినేని ప్రభాకర్ శుక్రవారం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులో నిర్వహించిన రెండేళ్ళపాలన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో కచ్చిరిదేవరాయపల్లి గ్రామానికి చెందిన కాకి లతకు డిఆర్‌డిఎ వెలుగు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఆటోనుఅందజేశారని , తల కుటుంబ జీవనోపాధికి కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ అభివృద్ధికి పూడికతీత పనులు, వీధి దీపాలు, విగ్నేశ్వర ఆలయానికి 40లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు



**బిట్రగుంట జూన్ 19 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీకి చెందిన తాగునీటి పథకంకింద కోవూరు పల్లి పోలేరమ్మ గుడి దగ్గర హైవేకి ఆనుకుని నిర్మించి ఉన్న బావి గోడ కూలి పోయి, చాలా ప్రమాదకరంగాతయారైంది, పాదచారులు, వాహనదారులు చీకటిలో ప్రయాణం చేసేప్పుడు అక్క డ అప్రమత్తంగా లేకపోతే బావిలో పడిపోయే ప్రమా దం ఉంది, కనీసం అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డు లు కూడాలేవు, దయచేసి మండలఅధికారులు, హైవే సిబ్బంది తగుచర్యలు తీసుకొని బావిగోడ నిర్మించి హెచ్చరిక బోర్డులుఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కోవూరు భవిత కేంద్రం సేవలు భేష్



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త** : కోవూరులోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగులైన విద్యా ర్థులకు విద్యా ఉపకరణాలు, వీల్ ఛైర్స్, వినికిడి యంత్రాలను ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ చేతుల మీదుగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులు ఈ భవిత కేంద్రాల్లోని సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేంద్రంలో ఉన్న ఐఈఆర్‌టీ కో ఆర్డినేటర్ మహేష్ టీచర్ కృపావతిలు ఎంతో ఓర్పుతో ఆదివ్యాంగులైన చిన్నారులకు విద్యాబోధన అందిస్తూ ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ముగ్గురు ఉత్తీర్ణులై ఈ భవిత కేంద్రానికి ఒక కొత్త రూపు తెచ్చారన్నారు. తల్లులు కూడా ఈ భవిత కేంద్రంలో కోఆర్డినేటర్ చేస్తున్న సేవలను ఇంటి దగ్గర తమ బిడ్డలకు మరలా చేపిస్తే త్వరగా వారికి నయమయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. అనంతరం వీల్ ఛైర్స్, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు , తల్లిదండ్రులు ఉన్నారు.

## జిల్లాలోనే కోవూరు మండలానికి జనాభా గణనలో ప్రత్యేక గుర్తింపు



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో గత నెలలో జరిగిన సెన్సస్‌కు సంబంధించి మెటీరియల్ ను పూర్తిగా తయారు చేసి దానిని ప్రత్యేకమైన సీల్ బాక్స్‌లో ఏర్పాటు చేసి శుక్రవారం పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా పంపేలా తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జనాభా గణనకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పార దర్శకంగా తమకు కేటాయించిన బాధ్యతలను నిర్వహించా రన్నారు. అదేవిధంగా జిల్లాలోనే కోవూరు మండలానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ఎన్యుమరేటర్లు, సూ పర్‌వైజర్లు చొరవ తీసుకున్నారని, ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్ఓ రామ్మోహన్, తదితరులు ఉన్నారు.

## డ్రైనేజీ పై స్పందించిన పంచాయతీ సిబ్బంది



**బిట్రగుంట జూన్ 19 ప్రభాతవార్త** విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో రామస్వామి పాలెం గుడి బడి దగ్గర ఉన్న డ్రైనేజ్ కాలవ గురించి 1100 నెంబర్ కి ఫోన్ చేసి డ్రైనేజీ కాల్వ పూడిపోయిందని కంప్లైంట్ ఇవ్వంగానే శుక్రవారం పంచాయతీ అధికారులు స్పందించి పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ పూడికె తీసినారని అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల రవిచంద్రతెలిపారు. స్పందించిన పంచాయితీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అదృష్టం తలుపుతడితే యంత్రం ఇంటికొచ్చినట్టే

**- లాటరీ పద్ధతిలో రైతులకు పరికరాల పంపిణీకి సన్నాహాలు**

**కోట, జూన్ 19 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద అన్నదాతలకు పరికరాలు అందజేయడానికి సిద్ధమవుతోంది. జిల్లాలో 4.17 కోట్ల విలువైన యంత్రాలు ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన. ఆన్‌లైన్‌లో ఇందుకు సంబంధించిన దరఖాస్తులు రావడంతో వాటిని పరిశీలించిన అనంతరం లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. యాంత్రీకరణ పరికరాల కోసం మే 5 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించారు. స్ప్రేయర్ల దగ్గర నుంచి ట్రాక్టర్ల వరకు వివిధ రకాల పరికరాలను ఈ పథకం కింద అన్నదాతలకు అందజేయనున్నారు. కేంద్రం యంత్రాలపై జిఎస్‌టిని 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో ధరలు గతంతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. దీనికితోడు ఈ సారి ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులతో పాటు మహిళలకు 50 శాతం రాయితీ ఇవ్వడంతో దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది వరకు యంత్రాలు కావాల్సిన వారు మండల వ్యవసాయాధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులకు దరఖాస్తులు ఇచ్చేవారు. ఈ ఏడాది ఆ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. దీనికితోడు పరికరాల వివరాలు, ధరలు అందులోనే పొందుపరిచారు.

**జిల్లా వ్యవసాయాధికారి వివరణ** జిల్లా యాంత్రీకరణ పథకం కింద ఎన్ని దరఖాస్తులు అందాయని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా, 2,500కు పైగా ఆన్‌లైన్‌లో రైతులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇందుకుగాను 4 కోట్ల 17 లక్షల రూపాయలు బడ్జెట్‌ను కూడా ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. జూలై 5, 6 తేదీల్లో లాటరీ విధానంతో ఎంపిక చేస్తారని తెలిపారు.

## అన్నదాత సుఖీభవ

**- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో జమకానున్న నగదు**

**కోట, జూన్ 19 ప్రభాతవార్త** కష్టాల్లో ఉన్న రైతాంగానికి చేయూతనిస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత ఏడాదిలో మూడు దఫాలుగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు వంతున సహాయం అందించింది. ప్రస్తుతం ఏడాదికి గాను తొలివిడతగా శనివారం రూ.7 వేలు వంతున సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నేరుగా రైతుల బ్యాంకుల ఖాతాలకు ఈ సహాయాన్ని జమ చేయనున్నారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పల్నాడు జిల్లాలో చేపట్టే కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ఒక్కో రైతుకు తొలివిడతగా రూ.2 వేలు జమ చేయనుంది. రాష్ట్రప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.5 వేలు వంతున జమ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ తెలిపారు. కోట మండలంలో 3,775 మంది రైతులను అర్హులుగా గుర్తించారు.

## సీనియారిటీ జాబితా సిద్ధం

**- రాష్ట్ర కార్యాలయానికి చేరిన టీచర్ల జాబితా**

**కోట, జూన్ 19 ప్రభాతవార్త** జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉపాధ్యాయుల సర్దుబాటు సీనియారిటీ జాబితాలు తుదిదశకు చేరాయి. ఈ జాబితాలను రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి జిల్లా విద్యాశాఖ నివేదించినట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి సర్దుబాటు జాబితా సన్నద్ధంలో జిల్లా విద్యాశాఖ నిమగ్నమైంది. అందులో భాగంగా నాలుగు దశల్లో తాత్కాలిక ప్రాథమిక సీనియారిటీ జాబితాపై సంబంధిత ఉపాధ్యాయుల నుంచిఅభ్యంతరాలు స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. అక్కడి నుంచి ఏ సమయంలో అయినా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం కానుంది.

**ప్రారంభంలోనే అలజడి** విద్యా సంవత్సరం ప్రారంభమై వారంరోజులు గడిచింది. సర్దుబాటు గుబులు ఉపాధ్యాయుల్లో అలజడిగా మారింది. ఎక్కడికి ఎవరు సర్దుబాటు అవుతారో సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటు బోధనకు, అటు సర్దుబాటుకు తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది.

**టెట్ ఎట్లా** మరోవైపు ఉపాధ్యాయులందరూ ఉద్యోగోన్నతి పొందాలంటే తప్పనిసరిగా టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పాస్ కావాల్సిందేనని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉపాధ్యాయుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. 30 ఏళ్లకు పైగా బోధన అనుభవం ఉన్న, 55 ఏళ్ల వయస్సు వచ్చినా టెట్ ఉత్తీర్ణత కావాల్సిందేనని చెప్పడం మరింత మానసిక ఒత్తిడికి గురి చేసిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, మరికొందరు ఇన్ సర్వీస్ టీచర్లకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక టెట్ నిర్వహిస్తామని చెప్పడంతో వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తరగతి గదిబోధనకు టెట్ ఆటంకం కానుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

## ఊటుకూరులో మూడో విడత గ్రామసభ



**విడవలూరు, జూన్ 19 ప్రభాతవార్త:** మండలంలోని ఊటుకూరు గ్రామ తుఫాన్ షెల్టర్లో ఒకే నెల-ఒకే గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా మూడో విడత గ్రామసభను డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.

- గ్రామ ప్రజల నుంచి గ్రామసభకు మొత్తం 8 అర్జీలు అందాయి. అందులో సర్వేకు సంబంధించి 4 అర్జీలు, డాటెడ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్కు సంబంధించి 2 అర్జీలు, మ్యూటేషన్లకు సంబంధించి 2 అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సలాం, వీఆర్వోలు చంద్రశేఖర్, మస్తాన్తో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ నాలుగో విడతకు ఏర్పాట్లు



**విడవలూరు, జూన్ 19 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీబోర్డు సభ్యురాలు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడవలూరు గ్రామంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ నాలుగో విడత కార్యక్రమం నిర్వహించనున్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

## వీఓఏలకు శిక్షణా కార్యక్రమం ముగింపు




**ఉదయగిరి, జూన్ 19, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోనే శ్రీశక్తి భవనం నందు శుక్రవారం ఏపీఎం శార స్రవంతి ఆధ్వర్యంలో వీఓఏలకు రెండో రోజు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-27 సంవత్సరాలకు సంబంధించిన వార్షిక ఆర్థిక రుణ ప్రణాళిక పై గ్రామ స్థాయిలో ఉన్న సంఘాల సభ్యుల అవసరాల గుర్తించడంపై సీసీలకు, వీఓఏలకు శిక్షణ కార్యక్రమం ఏపీఎం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం శారద స్రవంతి, సీసీలు శ్రీనివాసులు, సురేష్, బుచ్చిబాబు, రత్నకుమారి, పార్వతి, అకౌంటెంట్ విజయ్‌కుమారి, వీఓఏలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

## 23న అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



**ఉదయగిరి, జూన్ 19, ప్రభాతవార్త** ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి సీతారాంపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 23, 24వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. సీడీపీవో పుణ్యవతి మాట్లాడుతూ సీతారాంపురం ఉదయగిరి అంగన్‌వాడీకి కార్యకర్తలకు అప్లై చేసుకున్న వారు 23వ తేదీ ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 24వ తేదీనవరికుంటపాడు, దుత్తలూరుమండల పరిధిలోని అంగన్‌వాడీ పోస్టుల కుఆయా పోస్టులకు అప్లై చేసుకున్న వారు కావలి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలకు ఉదయం 10 గంటలకు జరుగుతాయని ఆమె తెలిపారు.

## పొదుపు మహిళలకు సూక్ష్మ ఆహార శుద్ధి ప్రణాళికపై అవగాహన



**బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వెలుగు కార్యాలయంలో ఏపిఎం శ్రీధర్ ఆధ్వర్యంలో సూక్ష్మ ఆహారశుద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ పథకానికి పలువురు లబ్దిదారులను ఎంపిక చేశారు. డిఆర్ పి.బానుచర్ ఎంపికైన వారికి ఇంటర్వ్యూలునిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిపిఎం శ్రీధర్ మాట్లాడుతు పిండిమిల్, మినీ రైసుమిల్లు, స్వీట్ తయారీ కేంద్రాలు ,చకోడి తయారీ యంత్రాలకు పొదుపు మహిళలకు రుణాలు ఇప్పించడం జరుగతుందన్నారు. లక్షరూపాయాలు 35000 సబ్సిడి లభిస్తుందన్నారు. ఈఅవకాశాన్ని పొదుపు సంఘంలో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిఆర్ భానుచందర్ ఎంపికైన లబ్దిదారును ఇంటర్వ్యూ చేసి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్తగా మహిళలను తయారు చేయాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ప్రభుత్వం పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలతో వ్యాపారంలో ఆర్థికంగా ఎదగాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాతో వైకాపా రహస్య ఒప్పందం

### వైకాపా నుంచి సస్పెండ్ గురైన ఎంపిటిసీ హిమబిందు ఆరోపణ




**కోట,జూన్ 19 ప్రభాతవార్త** కోట మండలంలోని వైకాపాలోని వర్గపోరు వల్లనే వైకాపా దక్కాల్సిన ఎంపిపి పదవి తెదేపా వ్యూహాత్మకంగా దక్కించుకుందని సస్పెండ్ గురైన కొక్కపాడు వైకాపా ఎంపిటీసీ సభ్యురాలు వేంబేటి హిమబిందు, ఆమె భర్త వెంకటకృష్ణయ్యలు ఆరోపించారు. వారు శుక్రవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ 9 మంది వైకాపా ఎంపిటిసి బలం ఉన్నా ముందుస్తుగా క్యాంప్ రాజకీయాల్లో చేయడం వెనకబడ టంతో తెదేపా వారు వారికి అనుకూలంగా మార్చుకోగాలరని చెప్పారు. నోటీఫికేషన్ రోజు నుంచి తెదేపా ఐక్యంగా ఉంటూ క్యాంప్ రాజకీయాలు చేశారని కానీ వైకాపా అలాంటి క్యాంప్ రాజకీయాలు చేయకుండా కేవలం దళిత బిడ్డకు ఎంపిపి పదవి దక్కకూడదని ఉద్దేశ్యంతో నిర్లక్ష్యంగా వ్యవంచారని వారు ఘూటగా విమర్శించారు.మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కోటలో వైకాపాలో ఉన్న వర్గ పోరు గురించి తెలియదన్నారు.2019లో వైకాపా ఎంపిటిసిల బలం 13 మంది. తెదేపా ఎంపిటిసిలు ముగ్గరు. తరువాత మరో ఇద్దరు వైకాపా ఎంపిపిటిలు తెదేపా కి మద్దతు ప్రకటించారు. ఇలా వైకాపా ఎంపిటిసీలను కాపాడుకొవడంలో వైకాపా నాయకులు లోపాయకారి తనం వల్లే ఉన్న 9 మంది ఎంపిటిసీలు మరో నలుగురు కూడా చే జారిపోయరాని విమర్శించారు. దీంతో ఎంపిపి ఎన్నికకు వచ్చినా ఓటమి పాలుకావడం తప్పదని ,దీంతో అవమానం పడే కంటే వేళ్లే కూడదనే నిర్ణయంకు వచ్చి ఆరోజు ఎంపిపి ఎన్నికకు రాలేదన్నారు. వైకాపా నాయకులు తెదేపాతో రహస్య ఒప్పందం కూదుర్చుకున్నారని ఆరోపించారు.తమను పార్టీ సస్పెండ్ చేసి ముందు షోకాజ్ నోటీసు ఇచ్చి ఉంటే నోటపికేషన్ రోజు నుంచి గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, కోట మండల కన్వీనర్‌లు వైకాపా ఎంపిటీసీలను కాపాడుకోవడం విఫలమైయ్యారని తమ భావాలను స్పష్టంగా వివరించే వారమని పేర్కొన్నారు. స్దానిక సంస్దల ఎన్నికలు లోపాల ఇక్కడ పార్టీలో వర్గపోరు సరి చేసుకొకపోతే ప్రజలు సరైన తీర్పు ఇస్తారని వారు చెప్పారు.

## కాగితమేనని పడేశారో.. ఓటు పోద్ది

### - సర్‌తో జాగ్రత్త సుమీ



**కోట, జూన్ 19 ప్రభాతవార్త** సర్ కార్యక్రమం ఈ నెల 15 నుంచి జిల్లాలో ప్రారంభమైంది. అధికారు లు సర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు ఉండటం, మృతుల పేర్లు జాబితాలో కొనసాగడం, వలసపోయిన వారి పేర్లు స్థానికంగా జాబితాలో ఉండటం వంటివిఇప్పటివరకు కొనసాగుతూ వచ్చా యి. సర్‌తో ఇటువంటి లోపాలన్నీ అధిగమించవచ్చు. ఓటర్లు తప్పకుండా తమకు ఇచ్చిన ఎన్యు మరేషన్ ఫారాన్ని నింపి ఇవ్వాల్సిందే. లేకపోతే ఓటు హక్కు పోతుందని, తర్వాత దాన్ని పొందేందుకు అవస్థలు పడాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ప్రక్రియను తెలుసుకోండి** ఇంటింటికి వచ్చి బిఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేస్తున్నారు. దీంతోపాటు వారి లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకుంటారు. వివరాలు నమోదయ్యాయని ధీమాతో ఫారాలను అశ్రద్ధ చేయకూడదు.అందులో అడిగిన ప్రతి సమాచారాన్ని నింపితిరిగి బిఎల్‌ఓలకు అంద జేయాలి. ఇదే సమాచారాన్ని తమ లాగిన్‌లో నమోదు చేసుకుంటారు. 2002 నాటి ఓటరు జాబితాతో మీ పేరు అనుసంధానమై ఉంటే దాన్ని అనుసరించి నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఒకవేళ ఆ జాబితాలో లేకుంటే తల్లిదండ్రుల వివరాల ఆధారంగా ఓటరు జాబితాలో ఎక్కడ ఉన్నదో వెతికి మరీ అనుసంధానిస్తారు.

**ఫారం తిరిగి ఇవ్వకపోతే..** ఫారం తిరిగి అందజేయకపోతే ఆయా ఓటర్లు స్థానికంగా లేనట్లుగానే భావిస్తారు. వివరాలను ఆబ్సెంట్‌షీ డెడ్‌జాబితాలో పెట్టేస్తారు. మళ్లీ ఓటు హక్కు పొందాలంటే తమ ఉనికిని నిరూపించుకునేందుకు అవసరమైన ఫారాలను అందజేసి నిరీక్షించాల్సి ఉంటుంది. ఓటరు గుర్తింపు కార్డుకు అనుసంధానించిన ఫోన్ నంబర్‌ను విధిగా తెలియజేయాల్సి ఉంటుంది.

**చిత్రంతో జాగ్రత్త** ఫొటోలను కూడా అప్‌లోడ్ చేస్తారు. అప్పటి ఫొటోలతో సరిపోలకపోతే చిత్రం ఆరంజ్ రంగులోకి మారిపోతుంది. అప్పుడు మళ్లీ ఫొటోను సరిచేసి సమర్పించాలి. ఒక మనిషికి సంబంధించి వివరాలు సేకరించడం, అప్‌లోడ్ చేయడానికి కనీసం అర్ధగంట సమయం పడుతుందని బిఎల్‌ఓలు చెప్తున్నారు. ప్రస్తుతం బిఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారాలనుఇస్తున్నారు. వీటిని ఓటర్లు నింపితిరిగి అందజేయాలి. బిఎల్‌ఓలను తమ డివైజ్‌లో వివరాలు నమోదు చేసుకుంటారు. ఫారాలను తిరిగి అందజేయడమే కీలకం. వాటిని తిరిగి ఇవ్వకపోతే ఎఎస్‌డి జాబితాలో పెట్టేస్తారు. ఆ తర్వాత ఉన్నామని నిరూపించుకునే బాధ్యత ఓటర్లదే.

## 13 వవార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు



**బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ పరిధిలోని 13 వవార్డులో గాంధీనగర్‌లో 1 వ వీధిలో కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ నేతృత్వంలో పారిశుధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. చెత్తా చెదారం తొల గించి, మురికి కాలువలను శుభ్రం పరిచారు. ప్రజల ఆరోగ్యంకోసం,పరిశుభ్రమైన వాతావరణం కోసం నిరంతరం కృషి చేస్తు వార్డును మరింత అందంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకుంటామని లక్ష్మీకాంతమ్మ తెలిపారు. స్వచ్ఛమైన వార్డు ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. తెలుగుదేశం సీనియర్ నాయకులు జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్ర మణ్యంనాయుడు, దుగ్గిశెట్టి హరినాద్, మందారపు రేవంత్, బిట్రగుంట రఘు, సుబ్బయ్య, పాల్గొన్నారు.

## హోం మంత్రి వంగలపూడి అనిత పై గుడివాడ అమరనాధ్ చేసిన వ్యాఖ్యలు సంస్కారహీనం

### - ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి - కర్నాటి ఆంజనేయ రెడ్డి



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త – అగ్రికల్చర్** కూటమి ప్రభుత్వంలో మహి ళా మంత్రులు, మహిళా నేతలపై వైసీపీ నేతలు చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యల పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్యా నలిస్ట్ కర్నాటి ఆంజనేయ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మహిళా నేతలపై అను చిత వ్యాఖ్యలు చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మహిళలపై చేస్తున్న వ్యాఖ్యలను తప్పుపట్టారు. వారి వైఖరి అభ్యంతరకరమని విమ ర్శించారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి, వైసిపి నాయకుడు గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై చేసిన వ్యాఖ్యలు జుగుప్సా కరంగా ఉన్నాయని విమర్శించారు. ఒక ఎస్సీ వర్గానికి చెందిన మహిళా మంత్రిపై సంస్కార హీనంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనిత హోం మంత్రి అయ్యాక నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని, 18.6 శాతానికి నేరాల సంఖ్య తగ్గిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై దౌర్జన్యాలు, అరాచకాలు తగ్గిపోయాయని ఇది హోం మంత్రి పనితీరుకు నిదర్శనం అన్నారు. 6.3 శాతానికి మహిళలపై దౌర్జన్యాలు అరాచకాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. గతంలోను, వర్తమానంలోనూ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు జిల్లా ప్రజలు తలదించుకునేలా ఉన్నాయని, దాని పర్యవసానం ఆయన అనుభవిస్తున్నాడని గుర్తు చేశారు. అభివృద్ధిలో శాసనసభ్యులతో పోటీపడుతూ,ఆమె ముందుకు సాగుతున్నారని అలాంటి మహిళానేతపై సంస్కారహీనమైన వ్యాఖ్యలు సరికాదని హితవు పలికారు. గుడివాడ అమర్నాథ్, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మహిళలపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యల పట్ల వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చెప్తే సమాజంలో వాళ్ళ గౌరవం పెరుగుతుందని తెలిపారు.

**– జగన్ వైఖరితో ఆ 11 సీట్లు కూడా రావు** వైసీపీ నాయకులు 2029లో అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని, ఇది కలగానే మిగులుతుందని కర్నాటి ఆంజనేయ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అర్థరహిత వ్యాఖ్యల పట్ల రోజురోజుకు దిగజారిపోతున్నారని పేర్కొన్నారు. ఆయన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్ల చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు ఇలాంటి వ్యాఖ్యల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో పాటు ఆయన పట్ల చులకన భావం పెరుగుతుందని వివరించారు ఆయన వైఖరి మార్చుకోకపోతే ఇంకా దిగజారి పోవడం ఖాయం అన్నారు. 2029లో అధికారంలోకి వస్తే వైసిపి వ్యతిరేకుల అంతు చూస్తామని అంటున్నారని ఈ బెదిరింపు ద్వారా నీతో అధికారంలోకి వచ్చేది కలేనన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి 39 శాతం ఓట్లు వచ్చాయని రానున్న ఎన్నికల్లో ఆయన పట్ల వ్యతిరేకత పెరుగుతుండడంతో ప్రస్తుతం ఆ శాతం 35కు పడిపోయిందన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఆయన నైజంగా మారిందని, ఈ వైఖరితో ఆ 11 సీట్లు కూడా రావు అన్నారు. రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అనేక పరిశ్రమలు రాష్టానికి రావడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి మార్గం సుగమం అయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డిఎస్ పరశురాం, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ కుప్ప ప్రసన్న, వై. ఫణి రాజు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లాల్ ఖాజా మస్తాన్, పి. మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఛలో సోమశిలను విజయవంతం చేద్దాం



ఆత్మకూరు,జూన్19,ప్రభాతవార్త: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధన లక్ష్యంగా , వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో కలిసి ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఈనెల 25వ తేదీ ఉదయం గంటలకు నిర్వహించనున్న "ఛలో సోమశిల" కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

## కోవూరులో వేడెక్కిన రాజకీయం




**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** ప్రశాంతంగా ఉన్న కోవూరు నియోజకవర్గంలో ఇప్పుడు రాజకీయం పూర్తిగా వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో వ్యక్తిగత విమర్శలు నియోజకవర్గంలోని ఇరు పార్టీల కేడర్‌లో వేడెక్కి స్తున్నాయి.నాయకుల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరుకుంది. దీంతో ఇరు పార్టీల కేడర్‌లో రాజకీయ జోరు ఊపందుకుంది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం, సవాళ్లు, ప్రతి సవాళ్లతో పలు చోట్ల ఉద్రిక్త వాతావరణం కూడా చోటు చేసుకుంది. ప్రశాంతంగా ఉన్న కోవూరు నియోజకవర్గంలో ఈ రాజకీయం వేడెక్కడంతో ఇరు పార్టీల్లో ఆందోళన బయలుదేరింది. ఇటీవల బుచ్చిరెడ్డి పాలెంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేపై చేసిన వ్యంగ్య విమర్శలు ప్రస్తుతం రాజకీయ వేడిని పుట్టించాయి. అనంతరం దామరమడుగులో జరిగిన ఓ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యానాలు చేయడం దానికి ప్రతిగా బుచ్చిలో వైసీపీ నాయకులు కూడా అదే రీతిలో కౌంటర్ ఇవ్వడంతో కోవూరులో రాజకీయం పూర్తిస్థాయిలో వేడెక్కింది. ఇటీవల కోవూరులో జరిగిన రెండు సంవత్సరాల విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలపై అటువంటి చులకనభావం చేయడం కూడా మంచిది కాదనే రీతిలో సమావేశంలో పాల్గొన్న మహిళలంతా గట్టిగా జవాబు ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఇరు పార్టీల్లో ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. ఈ పరిస్థితి ఏ తీరాలకు పయనిస్తోందని సీనియర్ నేతల్లో ఆందోళన బయలుదేరింది.

## కూలీల శాతాన్ని ఘనసీయంగా పెంచాలి



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు సంబంధించి ఆయా గ్రామాల్లో కూలీల శాతాన్ని పెంచేలా ఉపాధి హామీ పథకం సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు మరింత ఉపాధి కల్పించేలా తగు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేపట్టే పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని సూచనలిచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

## వీపీఆర్ నేత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని మోడేగుంట గ్రామంలో శుక్రవారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఇద్దరూ కూడా నెల్లూరు జిల్లాకు, కోవూరు నియోజకవర్గానికి చేస్తున్న సేవలు నిరుపమానం అన్నారు. ఇప్పటికే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు , వికలాంగులకు ట్రై సైకిళ్లు, అనాథ పిల్లలకు వీపీఆర్ విద్య ద్వారా విద్యను అందించడంతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారన్నారు. ప్రస్తుతం వీపీఆర్ నేత్ర పేరుతో పేదవారికి కంటి చూపు అందించాలనే ప్రధాన ధ్యేయంతో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రస్తుతం కోవూరు మండలంలో శుక్రవారం ఈ వీపీఆర్ నేత్ర కార్యక్రమం ప్రారంభం కావడం జరిగిందని, శనివారం వేగూరు పంచాయతీలో చేపట్టడం జరుగుతుందని, దీనిని ఆ ప్రాంత ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డిలు కూడా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి వెంటనే కంటి అద్దాలు అందించడమే కాకుండా ఆపరేషన్ అవసరమైన వారికి కూడా ఉచితంగా ఆపరేషన్ చేయించేలా వీపీఆర్ ఫౌండేషన్ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదర్ నాయుడు, దాసరి మురళి, వేగూరు సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.



## టీడీపీ భీమా - కార్యకర్తకు 5 లక్షల భీమా

### - మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ- సభ్యత్వ భీమాతో బాధిత కుటుంబానికి 5 లక్షలు



**నెల్లూరు,జూన్ 19, ప్రభాతవార్త – వైద్యం** దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త సుమన్ కుటుంబానికి 5 లక్షల రూపాయల భీమా పరిహారం అందింది. పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న సుమన్ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. ఎన్టీఆర్ నగర్ లోని సుమన్ కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల పరిహార పత్రాన్ని స్థానిక టీడీపీ నేతలు అందజేశారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భీమా నగదు త్వరితగతిన మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నాగేంద్ర, కార్పొరేటర్ గోతం అరుణ, బాలకృష్ణ, పార్టీ ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ఎన్టీఆర్ నగర్ బూత్ కన్వీనర్లు పాల్గొని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పార్టీ తరపున పూర్తి భరోసా ఇచ్చారు.

## పిడుగు బీభత్సం ధ్వంసమైన ఇంటి సామగ్రి



**విడవలూరు, జూన్ 19 ప్రభాతవార్త :** మండలంలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన స్వల్ప వర్షం సందర్భంగా పిడుగు పడటంతో బాల చంద్రయ్య గౌడ్ ఇంటి ఆవరణలో ప్రమాదం చోటు చేసుకుంది. పిడుగు శబ్దానికి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రి పూర్తిగా దెబ్బతిన్నాయి. బాధితుడు బాల చంద్రయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసా రిగా పిడుగు పడటంతో ఇంట్లో ఉన్న ఓచిన్నారికి స్వల్ప గా యాలయ్యాయి. అయితే పెను ప్రమాదం తప్పిందని తెలి పారు. జరిగిన నష్టానికి ప్రభుత్వం నుంచి సాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోరారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరా మర్శించి ధైర్యం చెప్పారు. ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించి, నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించి బాధిత కుటుంబానికి తగిన సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మకూరు మున్సిపాల్టీని వేగంగా అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి ఆనం



**ఆత్మకూరు ,జూన్19,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణాన్ని ఆధునిక మౌళిక వసతులతో అభివృద్ధి చేసి ప్రజలు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సి పాల్టీ పరిధిలోని పేరారెడ్డిపల్లి వద్ద అమృత్2.0పథకం కింద చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా అందించేందుకు 8.98కోట్ల రూపాయల వ్యయంతో నీటి సరఫరా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా 2.0ఎంఎల్‌డి సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్(డబ్ల్యుటిపి), 750కిలోలీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్(జిఎల్ఎస్‌ఆర్) నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈపనులు పూర్తయిన తర్వాత 1500కుటుంబాలకు కొత్త తాగునీటి కనెక్షన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. బలహీనవర్గాల కాలనీల్లో మౌళిక వసతుల కల్పనకోసం 3.87కోట్ల రూపాయలతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని, చెరువు అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు పట్టణ సౌందర్యం మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.పట్టణ రవాణా సౌకర్యాల మెరుగుదలకు 8కోట్ల రూపాయలతో ఆత్మకూరు బైపాస్ నాలుగు లైన్ల రహదారి నిర్మాణపనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. మున్సిపాల్టీ పరిధిలో సిసిరోడ్ల నిర్మాణానికి మరో 2కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే ఆపనులను కూడా ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆత్మకూరు మున్సిపాల్టీనిఇ వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నా మని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు, తాగునీరు, రహదారులు, పారిశుధ్య సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆకర్షణీయంగా ఐసిడిఎస్ స్టాల్

### - పరిశీలించిన మంత్రి -గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు పంపిణీ చేసిన మంత్రి




**ఆత్మకూరు ,జూన్19,ప్రభాతవార్త:** ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ కళ్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన కూటమి పాలన రెండేళ్ళ విజయోత్సవ సంబరాల సదస్సులో వివిధ శాఖల అధికారులు తమ తమ కార్యకలాపాలు , అభివృద్ధి గురించి వివరించే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ఆకర్షణీయంగా ,అర్ధవంతంగా అందర్నీ ఆకట్టుకుంది. ఆత్మకూరు, అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిలు పి.సునీలత, ఎం.పద్మావతిల ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ స్టాల్‌ను అత్యంత ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. వివిధరకాల పౌష్టికాహార వంటకాలు, పండ్లు, ఆకుకూరలు ప్రదర్శించారు. శాఖాపరమైన కార్యక్రమాలను వివరించే ఫోటో ఎగ్జిబి షన్‌నుఏర్పాటుచేశారు. ఈసందర్భంగా పేరారెడ్డి పల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్టాల్స్‌ను పరిశీలించి అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్ర మంలో సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. గ్రాడ్యుయేషన్ డే గురించి సిడిపిఒ పి.సునీలత వివరించగా మంత్రి ప్రశంసించారు. స్టాల్‌ను ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, ఆత్మకూరు తహసిల్దార్ పి.పద్మజాకుమారి, ఆత్మకూ రు, అనంతసాగరం, ఏఎస్‌పేట ఎంపిడిఒలు పి.రహీంఖాన్, పి.ఐజాక్‌ప్రవీణ్, పి.ప్రసన్నకుమారి తదితరులు పరిశీలించి స్టాల్ ఏర్పాటు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు జి.కస్తూరి,పద్మ, రమాదేవి, నారాయణమ్మ, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఆర్టీసి గ్యారేజీలో యోగాంద్ర కార్యక్రమం



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** ప్రతిరోజూ కొద్ది నిమిషాల పాటు యోగా సాధన చేయడంతో శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని ప్రముఖ యోగా శిక్షకులు, రెడ్‌క్రాస్ యోగా ధ్యానకేంద్రం కన్వీనర్ సోమశిల స్వర్ణలతతో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్టీసి డిపో గ్యారేజీలో యోగాంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపో మేనేజర్ డి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా స్వర్ణలత పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకొని పాటించాల్సిన యోగా ప్రోటోకాల్‌ను సిబ్బందితో అభ్యాసం చేయించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం పిలుపు మేరకు ప్రతి డిపోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 100మంది ఆర్టిసి సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ బి.మల్లికార్జున, డిప్యూటి సూపరింటెండెంట్ శ్రీనివాసులు, జిల్లా సెఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా శిక్షకులు సోమశిల స్వర్ణలతను డిపో సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## అభయ భవిత పోస్టర్లను ఆవిష్కరించిన ఆర్డీఓ



**కావలి, జూన్ 19 ప్రభాతవార్త :** భవిత పౌండేషన్ స్వామి బాలచంద్ర రూపొందించిన అభయ భవిత (జీవితం మనదే జీవమూ మనదే) మహిళలు తమ ఆత్మరక్షణ కోసం పాటించాల్సిన పది సూత్రాలకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం కావలి ఆర్డీఓ ఎలీషాబాబు, పట్టణ సిఐ ఫిరోజ్‌లచే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్,ఖాదర్‌బీ విద్యార్థులకు, చట్టాలు, సీవయ రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంల రహీంచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, సిపిసిఎల్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్‌జాగో వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్ జమీర్ హ్యాపీ సేవా సంస్థ చైర్మెన్ సయ్యద్ ఘనీ, గుడ్‌మెన్స్ ట్రస్ట్ చైర్మెన్ సోమిశెట్టి బ్రహ్మయ్యలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**నెల్లూరు రూరల్, జూన్ 19 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. నేడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందు బాటులో ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జీలు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నందిపాటి శ్యామ్, టీడీపీ నాయకులు వడ్లమూడి రమేష్ చౌదరి, నాటకరాణి నవీన్, రోహిణి తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని నాయకులు అధికారులకు సూచించారు.

## చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

### ..రాపూరు పడమరవీధిలో ప్రజల అవస్థలు..అధికారులు స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి



**రాపూరు, జూన్ 19, ప్రభాతవార్త :** రాపూరు పట్టణంలోని పడమరవీధిలో వున్నరాపూరు .పెంచలకోన ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఈ ప్రాంతం చిన్నపాటి చెరువును తలపిస్తు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. రాత్రి కురిసిన స్వల్ప వర్షానికే రోడ్డంతీ నీటితో నిండిపోవడంతో స్థానికులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వర్షాపు నీరు రోడ్డుకు పడమరవైపు నుండి తూర్పువైపుకు వెల్లేందుకు రహదారి కింద తూము ఏర్పాటు చేశారు. అయితే రహదారి ముందు బాగంలో వున్న కోనేరు గుంటను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీటి ప్రవాహ మార్గం పూర్తిగా దెబ్బతినంది. ఫలితంగా తూము ఉపయోగం లేకుండా పోయి వర్షపు నీరు వెళ్ళే దారి మూసుకుపోయింది. దీంతో చిన్న పాటి వర్షం కురిసినా నీరు రోడ్డుపైనే నిలిచిపోతూ చిన్న చెరువును తలపించే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు బురద నీటిలో నడుచుకుంటూ వెళ్ళాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, ద్విచక్రవాహదారులు కూడా ఈ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకోని వెల్లినా ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు. ఆక్రమణల కారణంగా మూసుకోని పోయిన వర్షపు నీటి ప్రవాహ మార్గాన్ని పునరుద్ధరించి, సరైన డ్రైనేజి కాలువ నిర్మించి వర్షపు నీరు సాఫీగా వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారిపైనే వర్షపు నీరు నిలిచి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని సంబందిత అధికారులు ఇప్పటికైనా వెంటనే స్పందించి సమస్యకు శాశ్వాత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నెల్లూరు నగరంలో విజయవంతంగా ముగిసిన యూఎఫ్ఎస్ వార్డు సభలు



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 19 ప్రభాతవార్త :** ఏకీకృత కుటుంబ సర్వేకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని 54వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన వార్డు సభలు విజయవంతంగా ముగిశాయని అదనపు కమిషనర్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు సబల నిర్వహణను అదనపు కమిషనర్ ఇతర నోడల్ అధికారులు వివిధ వార్డుల్లో ప్రత్యక్షంగా పరిశీలిం చాలని సభలకు ప్రజలు హాజరై తమ కుటుంబ వివరాలను పరిశీలించి అవ సరైమన సూచనలు అందజేయాలని తెలిపారు. ఈ సభల సందర్భంగా 30ఫి ర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించామని తెలి పారు. ఇంకా తమ కుటుంబ వివరాలను పరిశీలించని లేదా ఏవైనా వివరాల సవరణలు,చేర్పులు తొల గింపులు, అభ్యంతరాలు, లేదా ఫిర్యాదులు ఉన్న ప్రజలు ఈనెల 24వరకు వార్డు సచివాలయాలను సంప్ర దించి తమ వినతులను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు అందరూ ఈ అశాకాశాన్ని సద్వినియోగం చేసు కుని తమ కుటుంబ వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పరిశీలించి అవసరమైన అభ్యంతరాలు ఫిర్యా దులు సమర్పించాల్సిందిగా అదనపు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.